# ప్రజల ప్రాణాల కంటే ఓట్ల వేటే ముఖ్యమా

- ఆర్తనాదాలు వినే టైం లేదా?
- ప్రజాపాలన అంటే నోట్ల వేట.. ఓట్ల వేటనేనా?
- ఎన్నికల ప్రచారంలో మునిగితేలుతున్న రేవంత్
- సీఎంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది ఆచూకీ తెలియని విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగితేలుతున్నారని, ఇది దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'జరిగిన ఘోర దుర్ఘటనపై ముఖ్యమంత్రికే సీరియస్ నెస్ లేకుంటే ఇక అధికార యంత్రాంగానికి ఎక్కడ ఉంటది ? సహాయ చర్యలు ఎలా ముందుకు సాగుతాయి?' అని సోమవారం ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. 'జిల్లాలకు జిల్లాలు పర్యటిస్తూ ఓట్లవేట కోసం ముఖ్యమంత్రికి సమయం ఉన్నదిగాని, ఎస్ఎల్‌బీసీ సొరంగ బాధితుల ఆర్తనాదాలు వినేందుకు టైం లేదా? ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ప్రాణాలకు ఇచ్చే విలువ ఇదేనా? ప్రజాపాలన అంటే నోట్ల వేట.. ఓట్ల వేట మాత్రమేనా?' అని నిలదీశారు. ఎస్ఎల్‌బీసీలో సహాయక చర్యలు కొలిక్కి రాకముందే, సొరంగంలో శకలాల కింద చిక్కినవారు బతికుండే అవకాశం కనిపించడం లేదని సర్కారు చేతులెత్తేసినట్టే కనిపిస్తున్నదని మండిపడ్డారు.

### ప్రమాదంపై మౌనమెందుకు బండీ?

'కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు శ్రీశైలం జల విద్యుత్తు కేంద్రంలో ప్రమాదంపై నానా యాగీ చేసిన బండి సంజయ్.. ఎస్ఎల్‌బీసీ ఘటన జరిగి మూడు రోజులవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారు?' అంటూ కేటీఆర్ నిలదీశారు. 'రేవంత్‌రెడ్డి మీద రహస్య ప్రేమకు నిదర్శనమా?' అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నాస్త్రాలు సంధించారు. ట్వీట్‌కు బండి సంజయ్ విమర్శల వీడియో ట్యాగ్ చేశారు.

# సంక్లిష్టంగా సహాయ చర్యలు

- ప్రత్యామ్నాయాలు మృగ్యం
- లోపల నీరు.. పైన కీకారణ్యం
- భారీగా పేరుకున్న బురద
- ర్యాట్ మైనర్ల ఉపయోగం అంతంతే!

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం వద్ద సహాయక చర్యలకు సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చేపడుతున్న చర్యలు ముందుకు సాగడం లేదు. లోపలి వైపు భారీగా నీరు చేరుతుండటంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. సహాయ బృందాలు లోపలికి వెళ్తూ ప్రమాదస్థలం వద్ద పరిస్థితులను చూసి వెనక్కి వస్తున్నారు. సహాయ చర్యలకు ప్రధానంగా సొరంగంలో భారీగా వస్తున్న ఊట నీరు, భారీగా పేరుకుపోయిన బురదనే అవరోధంగా నిలుస్తున్నదని ఆయా బృందాల సిబ్బంది పేర్కొంటున్నారు. భూమి ఉపరితలం నుంచి ప్రమాదం జరిగిన టన్నెల్ ప్రాంతానికి డ్రిల్ చేయడం కూడా అసాధ్యమేనంటున్నారు. ఈ నేపథ్యంలో సొరంగ మార్గం తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదని సహాయ బృందాలు, అధికారులు తేల్చేసినట్టు తెలుస్తున్నది. ఇక సొరంగం పూర్తిగా పూడుకుపోగా లోపల చిక్కుకున్న కార్మికుల ఉనికిని తెలుసుకునేందుకు ర్యాట్ మైనర్లను పిలిపించారు. అయితే ఈ విధానం కూడా సరిగా పనిచేయని పరిస్థితులు అక్కడ ఉన్నాయని అంటున్నారు. భూమి గట్టిగా, నీటి ఊటలు లేని చోట మాత్రమే ర్యాట్ మైనర్లు సమర్థవంతంగా పని చేస్తాయని తెలుస్తున్నది. నీటిఊట ఉన్న చోట ర్యాట్‌మైనర్లు ఎలాంటి రంధ్రాలను చేయలేక పోవడంతోపాటు, వెంట వెంటనే అందులో మట్టి జారిపోతున్నదని వివరిస్తున్నారు. దీంతో ర్యాట్‌మైనర్లు ఇక్కడ నిష్ప్రయోజనమని తెలుపుతున్నారు. శిథిలాలను తొలగించడం ఒక ఎత్తయితే, వాటిని వెలుపలికి తరలించడం సవాలుగా ఉన్నదని సహాయ బృందాలు వివరిస్తున్నాయి. ఇలా అన్ని విధాలుగా ప్రతికూల పరిస్థితులే నెలకొన్నాయి. దీంతో సహాయ చర్యలు ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి వేస్తున్న పరిస్థితి నెలకొన్నది. మరోవైపు లోపల చిక్కుకున్న కార్మికుల స్థితిగతులపై అంతటా ఉత్కంఠ నెలకొన్నది.

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో భారీగా పేరుకుపోయిన నీరు, బురద

సొరంగంలో భారీ యంత్ర సామగ్రి

సొరంగంలో బాధితుల ఆచూకీ కోసం డ్రోన్ సాయంతో అన్వేషిస్తున్న నిపుణులు

# 72 గంటలుగా ఎడతెగని ఉత్కంఠ

మొదటిపేజీ తరువాయి...

వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటినీ అధిగమించి మద్రాస్ ఐఐటీ నిపుణులు తీసుకొచ్చిన ప్రోబ్ కెమెరాలతో పాటు.. అత్యాధునిక టెక్నాలజీతోపాటు హై రిజల్యూషన్ కలిగిన ఆక్వా ఐ కెమెరాలను లోపలికి పంపించారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించినా ఫలితం కనిపించలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి ఒక బృందం వెళ్లినా.. అక్కడ బురద, నీళ్లు మిషనరీ వల్ల తిరిగి వెనక్కి వచ్చారు. ఏ సమయంలోనైనా లోపలున్నవారిని గుర్తించే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఐదు అంబులెన్స్‌లను, డాక్టర్ల బృందాన్ని సిద్ధంగా ఉంచింది. హై రిజల్యూషన్ రిమోట్ కెమెరాలను పంపించి ఘటనా స్థలం మొత్తం రికార్డింగ్ చేయిస్తున్నారు. ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్ టీంలతో పాటు మిగతా బృందాలు నిర్విరామంగా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చీఫ్ కమిషనర్ అరవింద్ కుమార్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, నాగర్ కర్నూల్ కలెక్టర్ సంతోశ్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.

### ఆక్వా ఐ.. ఫ్లెక్సీ ప్రోబ్ పరికరాలపైనే ఆశలు

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు అత్యాధునిక పరికరాలను వాడుతున్నారు. మద్రాస్ ఐఐటీకి చెందిన సాంకేతిక నిపుణుల సహకారంతో రెస్క్యూ ఆపరేషన్ చేయనున్నారు. ఐఐటీ నిపుణులు ప్రత్యేకంగా తీసుకువచ్చిన ఆక్వా ఐ కెమెరా హై రిజల్యూషన్‌తో కూడినది. ఇది నీటిలో సుమారు 50 మీటర్ల చుట్టుపక్కల ఉన్న వాటిని గుర్తిస్తుంది. బురదలో ఏ చిన్న వస్తువు ఉన్నా రికార్డ్ చేస్తుంది. ఈ కెమెరాతో లోపల చిక్కుకున్నవారి పరిస్థితిని తెలుసుకోవడంతోపాటు... ఆ తర్వాత రెస్క్యూ ఆపరేషన్‌కు ఇది తోడ్పడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

### రిమోట్ కెమెరాలతో నిఘా

ప్రోబ్ కెమెరా లోపలికి పంపించి ఆ చిత్రాల ఆధారంగా ఏం చేయాలన్న దానిపై నిపుణులు ఇచ్చిన సూచనలను పాటించి రెస్క్యూ చేసే అవకాశం ఉంది. మరోవైపు హై రిజల్యూషన్ కలిగిన కెమెరాలను కూడా పంపిస్తున్నారు.

### విమర్శలతో వేగంగా సహాయక చర్యలు

ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వస్తుండటంతో ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సహాయక చర్యలను ముమ్మరం చేసింది. దాదాపు మూడ్రోజుల తర్వాత మేల్కొన్న సర్కారు అందుబాటులో ఉన్న ఇతర చోట్ల జరిగిన ప్రమాదాలను గుర్తించి విజయవంతం చేసిన బృందాలను రప్పిస్తున్నది. ముందుగా ఖర్చుకు వెనకాడినా ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సింగరేణితో ఫలితం లేదని భావించి ఇతర నిపుణులను రంగంలో దించాలని నిర్ణయం తీసుకున్నారు. అన్ని బృందాలను సమన్వయం చేస్తూ ముందుకుసాగితే చిక్కుకున్నవారిని రక్షించడంతోపాటు.. సొరంగ మార్గంలో షియర్ జోన్‌ను గుర్తించి ముందుకు వెళ్లొచ్చని నిర్ణయానికి వచ్చారు.

### రంగంలోకి నేవీ బృందం

సొరంగంలో నీరు, బురద ఎక్కువగా ఉండడంతో వాటిని అధిగమించాలంటే నేవీ బృందంతోనే సాధ్యమవుతుందని భావించి విశాఖపట్నం నుంచి హుటాహుటిన వారిని రప్పించారు. ఈ బృందం రంగంలో దిగడంతో పరిస్థితి ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నారు. 14 నుంచి 11వ కిలోమీటర్ల వరకు లోకో రైలు పట్టాలు మునిగిపోయాయి. ఆదివారం 13 కిలోమీటర్ల లోపలికి చేరుకున్న రెస్క్యూ బృందం సోమవారం 11 కిలోమీటర్ల వరకు మాత్రమే వెళ్లగలిగింది.

### గంట గంటకూ సమీక్ష..

విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ గంటగంటకూ సమీక్ష నిర్వహిస్తున్నారు. బృందాలు ఏడుసార్లు టన్నెల్‌లో తనిఖీలు నిర్వహించినట్టు మీడియాకు వివరించారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తులలో ఈ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌ను సమర్థంగా నిర్వహించాయని తెలిపారు. కాగా, టన్నెల్‌లో సహాయ చర్యలను పర్యవేక్షించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సాయంత్రం జేపీ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

### ఫోన్ సిగ్నల్ దొరికినా కానరాని ఆచూకీ..

**సొరంగంలో** చిక్కుకున్న ఎనిమిది మందిలో కొంతమంది ఫోన్లు ఇంకా రింగ్ అవుతున్నాయని.. కానీ, రెస్పాన్స్ లేదని ఉన్నతాధికారులు అంటున్నారు. కాసేపటికి ఒకరిద్దరి ఫోన్లు స్విచ్ ఆఫ్‌గా వచ్చాయని వివరించారు. అయితే ఫోన్ రింగ్ ఆధారంగా లొకేషన్ ట్రేస్ చేస్తే దోమల పెంట సమీపంలో చూపిస్తుందని.. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కచ్చితమైన లొకేషన్ గుర్తించేందుకు కూడా ప్రయత్నిస్తున్నామని ఉన్నతాధికారులు ప్రకటించారు. మొత్తంగా రెస్క్యూ ఆపరేషన్ గంటగంటకు ఉత్కంఠను రేపుతున్నది.

### బాధితులకు భరోసా

**సొరంగంలో** చిక్కుకున్న ఎనిమిది మంది కుటుంబ సభ్యులకు ఎట్టకేలకు అధికారులు సమాచారం అందించారు. వారిని బయటికి తీసేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. చిక్కుకున్నవారిలో కొందరి కుటుంబ సభ్యులు దోమల పెంటకు చేరుకున్నారు. పరిస్థితులను జిల్లా కలెక్టర్ సంతోశ్ వారికి వివరించారు. తోటి కార్మికులను మీడియాకు దూరంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

### ఢిల్లీ నుంచి ర్యాట్ మైనర్స్ టీం

**ఉత్తరాఖండ్‌లో** జరిగిన ప్రమాదంలో ర్యాట్ మైనర్స్ టీం దాదాపు 41 మందిని రక్షించింది. 14 మంది ర్యాట్ (ర్యాట్ హోల్ టీమ్)మైనర్స్‌ను కూడా సహాయక చర్యల్లో ఉపయోగిస్తున్నారు. వీరితోపాటు టన్నెల్‌లో ఉన్నవారి ఆచూకీ తెలుసుకొనేందుకు స్నిఫర్ డాగ్స్‌లను రప్పించారు. అయితే, నీరు ఉన్నందున అవి లోపలికి వెళ్లలేకపోయాయి. ఇప్పటికే డ్యామేజీ అయిన కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు చేపట్టారు. కాగా, టన్నెల్ లోపలికి పై నుంచి రంధ్రం చేసి లోపలికి వెళ్లాలన్న (వర్టికల్ డ్రిల్లింగ్) ప్రతిపాదనను తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో 5 గ్యాస్ కట్టింగ్ మిషన్లు రేయింబవళ్లు పని చేస్తున్నాయి.

# పేరు కోసం మంత్రుల పాకులాట

- ప్రాణాపాయంలో కార్మికులు పట్టింపుల్లో మంత్రులు!
- మీడియాతో మాట్లాడే పోటీ
- ఒకరి పనికొకరు అడ్డంకులు
- మరో మంత్రి అత్యుత్సాహం
- మంత్రులపై విమర్శల వెల్లువ

హైదరాబాద్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): టన్నెల్ కూలిన ఘటనలో ఓవైపు కార్మికులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే.. మరోవైపు రాష్ట్ర మంత్రులు పేరు కోసం పాకులాడుతున్నారు. ఇద్దరు మంత్రుల మధ్య ఘటన ప్రాంతంలోనే ఆధిపత్య పోరు కొనసాగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టన్నెల్ ఘటనలో తానే ఎక్కువ పని చేసినట్టు చూపేందుకు ఓ మంత్రి నానా తంటాలు పడుతున్నట్టు తెలిసింది. అధికారులతో సమీక్షలు, మీడియాతో మాట్లాడటం, కేంద్రప్రభుత్వ రెస్క్యూ టీంతో సంప్రదింపులు, చివరికి టన్నెల్‌లోకి వెళ్లడం.. ఇలా అన్నింటా వారు పోటీపడటం అందర్నీ విస్మయం కలిగించింది. 'నీకు ఈ అంశంపై సబ్జెక్ట్ లేదు. కాబట్టి జాతీయ మీడియాతో నేనే మాట్లాడుతాను' అంటూ ఓ మంత్రి చెప్పగా మరో మంత్రి అసహనానికి గురైనట్టు సమాచారం. ఒక్కరే అధికారులతో సమీక్ష నిర్వహించడం, ఆదేశాలు జారీచేయడంపై సదరు మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో ఎవరికివారే అన్నట్టుగా సహాయ చర్యలను పర్యవేక్షించడం ప్రారంభించినట్టు తెలుస్తున్నది. అందులో భాగంగా సదరు మంత్రికి చెప్పకుండానే మీడియా ప్రతినిధులతో పాటు ఉన్నతాధికారులను టన్నెల్ లోపలికి తీసుకెళ్లేందుకు సిద్ధమైనట్టు సమాచారం. మరో మంత్రి అత్యుత్సాహాన్ని ప్రదర్శించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటన జరిగిన రెండు రోజులకు ఆగమేఘాలపై వెళ్లిన సదరు మంత్రి.. తాను వెళ్లాకే సహాయక చర్యలు ప్రారంభమైనట్టు బిల్డప్ ఇచ్చినట్టు సమాచారం. నిమిషానికో బ్రేకింగ్ న్యూస్, ప్రకటనలు, ఫొటోలు విడుదల చేస్తూ హంగామా చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# సర్కారు వైఫల్యంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం

- 8 మంది ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే ప్రాణాలు ముఖ్యమా? ఎన్నికల ప్రచారమా?
- సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి పోయిండు
- ఆ ప్రాజెక్టు పనికి రాదని గతంలోనే కేసీఆర్ చెప్పిండ్రు
- బీఆర్ఎస్, కేసీఆర్‌పై మంత్రుల ఆరోపణలు సత్యదూరం
- చేతగాకనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తప్పుడు కూతలు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తేతెలంగాణ): 'ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకొని 8 మంది కార్మికులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే..ముఖ్యమంత్రి మాత్రం ఇదేమీ పట్టకుండా ఎన్నికల ప్రచారానికి పోయిండు.. రేవంత్‌రెడ్డికి కార్మికుల ప్రాణాలు ముఖ్యమా? ఎన్నికల ప్రచారామా?' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగిందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు రాజకీయాల కంటే కార్మికుల ప్రాణాలే ముఖ్యమని, వారంతా సురక్షితంగా బయటపడాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టును ముట్టగానే పడిపోయిందని.. కేసీఆర్ ప్రభుత్వం ఇన్నాళ్లూ నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉన్నదని ఆక్షేపించారు. 'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టు పని కిరాదు.. అనవసరంగా సొరంగంలో టీబీఎంను ఇరికించారు..రోజుకు మీటర్‌కు మించి తవ్వడం సాధ్యం కాదని అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిండ్రు' అని గుర్తుచేశారు. అప్పటి ప్రతిపక్ష నేత జానారెడ్డి సూచన మేరకు రెండోరోజే అఖిలపక్ష సమావేశం పెట్టి వారి సలహాలు, సూచనలు స్వీకరించిన విషయం ప్రజలందరికీ తెలుసని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల సూచన మేరకు వెంటనే టెండర్లు పిలిచి రూ.100 కోట్ల అడ్వాన్స్ ఇచ్చి ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారని..ఇది ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్‌పై కేసీఆర్, బీఆర్ఎస్‌కు ఉన్న కమిట్‌మెంట్‌కు నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు 2005లో పనులు ప్రారంభించి 2014 వరకు రూ.3300 కోట్ల మేరకు పనిచేసిందని, కానీ బీఆర్ఎస్ హయాంలో రూ. 3900 కోట్లు వెచ్చించి 9 కిలోమీటర్ల మేరకు తవ్వకం పనులు పూర్తి చేసిందని గుర్తుచేశారు. కరోనా సమయంలోనూ పనులు కొనసాగించామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాజెక్ట్‌ను అటకెక్కించారని మంత్రి ఉత్తమ్ కుమార్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆయనతో పాటు మరో మంత్రి కూడా కేసీఆర్ హయాంలో 5 కిలో మీటర్లు కూడా పూర్తి చేయలేదని తప్పుడు కూతలు కూస్తున్నారని నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాళేశ్వరం కూలిపోయిందం టూ కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేశారని మండిపడ్డారు.

### ఏడాదిలో 3 ప్రాజెక్టులు కూలినయ్

కాంగ్రెస్ ఏడాది పాలనలోనే 3 ప్రాజెక్టులు కూలిపోయాయని హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మంలో వచ్చిన వరదలకు పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోయి తీరని ఆస్తి, పంట నష్టం జరిగిందని చెప్పారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు తాగునీరందించే సుంకిశాల, ఇప్పుడు ఎస్ఎల్‌బీసీ కూలిపోయిందని, కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం, చేతగాని తనానికి ఈ ఘటనలే నిదర్శనమని దెప్పిపొడిచారు.

### హెలికాప్టర్ లేకనే ఉత్తమ్ ఇంట్లో ఉన్నడు

ఇంతపెద్ద దుర్ఘటన జరిగి 8 మంది ప్రాణాలు ఆపాయంలో చిక్కుకుంటే ముఖ్యమంత్రికి ఎన్నికల ప్రచారమే ముఖ్యం కావడం దురదృష్టకరమని హరీశ్ వాపోయారు. ఆయన ప్రచారానికి ప్రభుత్వ హెలికాప్టర్‌ను తీసుకెళ్లడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంట్లోనే ఉండి పోయారని ఎద్దేవాచేశారు. హెలికాప్టర్‌లేని కారణంగానే ఘటనాస్థలానికి ఉత్తమ్ వెళ్లలేదని దెప్పిపొడిచారు. ఇంత ఘోరం జరిగినా ప్రభుత్వం మాత్రం దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో సుంకిశాల ఘటన జరిగినప్పుడూ ఇదే తరహాలో వ్యవహరించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలకు ప్రజలు బుద్ధిచెప్తారని హెచ్చరించారు.

### మీడియాకు నో ఎంట్రీ

**ఈ ప్రమాదంపై** తెలుగు మీడియాతో పాటు జాతీయ మీడియా కూడా ఫోకస్ పెట్టింది. ఈ ఘటనను జాతీయ మీడియా ప్రముఖంగా ప్రసారంచేస్తున్నది. అయితే మీడియా అడుగుతున్న ప్రశ్నలకు ఇటు మంత్రులు కాని.. అటు అధికార యంత్రాంగం కాని సరైన సమాధానాలు ఇవ్వడం లేదు. ఒక దశలో ప్రభుత్వం ఖర్చుకు వెనకాడుతున్నదని ఉన్నతాధికారులు మీడియా ముందు వాపోగా.. ఇది గమనించిన సర్కారు మీడియాను దూరం పెట్టాలని నిర్ణయించింది. మంగళవారం నుంచి మీడియాను పనులు చేపడుతున్న కాంట్రాక్టు కంపెనీ క్యాంపు కార్యాలయం వరకే అనుమతించనున్నారు. అక్కడే మీడియాకు బ్రీఫ్ చేస్తారని సమాచారం.

# కార్మికులను రక్షించడంలో నిర్లక్ష్యం

- సీఎం తీరు తీవ్ర అభ్యంతరకరం
- బీఆర్ఎస్‌పై బురద జల్లడం విడ్డూరం
- ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పనులకు మంగళం పాడేందుకే లీకులా?
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్

హైదరాబాద్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): 'ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి మూడు రోజులు దాటింది. ఎనిమిది మంది కార్మికులు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి మానవత్వం మరిచి, శ్రమజీవుల ప్రాణాలను గాలికొదిలి ఎన్నికల ప్రచారానికి వెళ్లడం దుర్మార్గం' అంటూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రికి కార్మికుల ప్రాణాలకన్నా ప్రచారమే ముఖ్యమా? అని ప్రశ్నించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. ఘటన జరిగి మూడు రోజులైనా ప్రమాదానికి గల కారణాలపై స్పష్టత లేకపోవడమే ఇందుకు నిదర్శనమని దుయ్యబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వానికి బీఆర్ఎస్ సహకరించేందుకు సిద్ధంగా ఉన్నదని చెప్పారు. కానీ సీఎం, మంత్రులు మాత్రం రాజకీయం చేస్తున్నామంటూ తమపై బురదజల్లడం విడ్డూరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సాయం అడగకుండా, ఇలాంటి రెస్క్యూ ఆపరేషన్లలో అనుభవం ఉన్న నిపుణులను రప్పించకుండా తాత్సారం చేయడం బాధాకరమని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో చక్కర్లు కొడుతుంటే, మంత్రులు టన్నెల్ వద్ద ఫొటోలకు పొజులు ఇస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

### కేసీఆర్ కూలీలను కాపాడుకున్నరు

తెలంగాణ పునర్నిర్మాణంలో బయటి రాష్ట్రాల కార్మికుల పాత్ర ఎంతో ఉన్నదని భావించి కేసీఆర్ వారిని కాపాడుకున్నారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. కరోనా కాలంలో వారికి సరుకులు, బియ్యంతోపాటు నగదు అందించి సురక్షితంగా వారిని సొంత రాష్ట్రాలకు పంపించారని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పొరుగు రాష్ట్రాల కూలీలు ఆపదలో చిక్కుకుంటే కనీసం మానవత్వం చూపడంలేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి ఇచ్చిన విలువ వారి ప్రాణాలకు ఇవ్వడంలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్ర పాలకులు ఎవరికీ పనికిరాని ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్‌ను రాష్ట్రంపై బలవంతంగా రుద్దారని దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లా ప్రజలకు కృష్ణా జలాలు అందకుండా చేసే కుట్రతోనే ఈ పథకాన్ని ప్రారంభించారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఆదరాబాదరాగా సొరంగం పనులు చేపట్టి కూలీల ప్రాణాలను బలిపెట్టేందుకు సిద్ధమైందని విమర్శించారు. సీపేజీ ఆగకపోవడంవల్లే గతంలో పనులు ముందుకుసాగలేదనే విషయాన్ని విస్మరించి టన్నెల్ తవ్వకం పనులు చేపట్టిందని దుయ్యబట్టారు. రేవంత్ సర్కారు ఇప్పటికైనా వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

### ఎస్ఎల్‌బీసీకి మంగళం పాడేందుకే లీకులా?

ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగి మూడు రోజులైనా ఏ ప్రాంతంలో చోటుచేసుకున్నది? టీబీఎం మిషన్‌కు ఎంత దూరంలో ఉన్నది? మధ్యలో ఖాళీ ప్రదేశం ఉన్నదా? అనే విషయాలను ప్రభుత్వం చెప్పలేకపోతున్నదని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. 'ప్రమాదం గురించి, సహాయ చర్యల గురించి మాట్లాడని ప్రభుత్వం.. తనకు అనుకూలంగా ఉండే మీడియాతో మాత్రం పనికిమాలిన రాతలన్నీ రాయిస్తున్నది. టీబీఎం మిషన్ పనికిరాదని, ప్రత్యామ్నాయ మార్గం కావాలంటూ కథనాలు వండి వారుస్తున్నారు. అంటే ప్రభుత్వం ఈ టన్నెల్ పనులకు ప్రత్యామ్నాయం వెతుకుతున్నట్టా? ఎస్ఎల్‌బీసీకి మంగళంపాడినట్టేనా?' అంటూ జగదీశ్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు.

# మూన్నెళ్లుగా జీతాల్లేవు!

- ప్రాణాలు అరచేతులో పెట్టుకుని పనిచేస్తున్నం
- గొడు వెల్లబోసుకున్న ఎస్ఎల్‌బీసీ కార్మికులు
- బోరున విలపిస్తున్న కూలీలు

అచ్చంపేట, ఫిబ్రవరి 24: ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు చేస్తున్న కార్మికుల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉంది. తోటి కార్మికులు టన్నెల్‌లో చిక్కుకుపోవడంతో అక్కడంతా విషాదవాతావరణం నెలకొంది. దోమలపెంట వద్ద కార్మికుల దయనీయ పరిస్థితిని తెలుసుకునేందుకు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి ప్రయత్నించినా షాక్‌లో ఉండడం వల్ల వాళ్లెవరితోనూ మాట్లాడలేకపోతున్నారు. అక్కడ జేపీ, రాబిడ్స్ కంపెనీ కార్మికులు ఉన్నారు. కానీ వారి యోగక్షేమాల గురించి మాటామాటా కలుపగా గుండెగోడును వెళ్లబోసుకున్నారు. "మూడ్నెల్లుగా జీతాల్లేవు.. మావాళ్లకు ఫోన్లు చేసి పైసలు తెప్పించుకుని, సరుకులు కొనుక్కుంటున్నాం. మాకు రావాల్సిన డబ్బులిస్తే మా ఊళ్లకు వెళ్లిపోతాం" అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. టన్నెల్ సమీపంలో ఒక షెడ్డులో మొత్తం 150 మంది ఉంటున్నట్టు తెలిపారు. తమ సమస్యలు పట్టించుకునేవారు లేరని కన్నీటి పర్యంతమయ్యారు. షిఫ్టులో 10 గంటలు పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. కష్టాలు భరిస్తూ ఉండలేక, ఉత్తచేతులతో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.

### కండ్ల ముందే కూలింది

ఆ రోజు 50 మంది కార్మికులం లోపలికి వెళ్లాం. నేను మిషన్ వెనుకభాగంలో పనిచేస్తున్నాను. టన్నెల్ పైకప్పులోని రంధ్రాల నుంచి నీళ్లు కారుతున్నాయి. ఆ రంధ్రాలను మూసి వేసేపనిలో ఉన్నాను. నీళ్లు ఎక్కువగా వస్తున్నాయి. మట